

# అమెరి'కాకమ్మ'కథలు

## వంగూరి చిట్టెన్ రాజు



# గొప్పవాళ్ళతో భుజములు రాసుకొనుట...

### అమెరికాకమ్మ కథలు- 8

నాలుగైదు వారాల క్రితం, ఒకానొక శుక్రవారం అర్ధరాత్రి ....హాయిగా నిద్రపోతున్నాను... ఇంతలో కెవ్వున కేక... ఈ మధ్యన ఒక టెలెగూ టీవీలో "కేక, కేక..." అంటూ అర్ధం పర్ధం లేని కమర్షియల్‌కీ, ఈ కేకకీ తేడా ఏమిటంటే ఈ కేక పెట్టిన సుందరాంగి సాక్షాత్తూ మా క్వీన్ విక్టోరియా గారే. ఆ విధంగా కేక పెట్టిన ప్రదేశం మా ఇంట్లో ఉన్న ఒకే ఒక మాస్టర్ బెడ్ రూం అనే గదిలోనే! ఆ "స్టోను" వినగానే, హఠాత్తుగా లేచి నా ఒరిజినల్ పద్ధతిలో నేను కూడా కెవ్వున కేక పెట్టాను. ఈ విధంగా మా పరస్పర కేకల కార్యక్రమం మృదంగం విద్వాంసుడి మద్దెల వాయిద్యంలా నిరాటంకంగా సాగుతూండగా నాకు భలే అనుమానం వచ్చి, నా కేకలు ఆపి "ప్రేయసీ, ఎందుకు అలా కేక పెట్టావూ?" అని ప్రేమగా అడిగాను.

"మూడు నెలలగా ప్రతీ వీకెండూ ఏదో ఊరికి పోతున్నావు కదా. మరి ఈ శుక్రవారం అర్ధరాత్రి ఇక్కడ కనపడుతూంటే, ఎవడో దొంగ వెధవ అనుకుంటే, మరి కేక పెట్టనా?" అంది క్వీన్ విక్టోరియా, "నేను నివసించే వినాయకుడి బొడ్డులో వేలు పెడితే కుట్టనా" అన్న తేలు టైపులో.

వెంటనే నాకూ ఐటీ ఉద్యోగస్తులకీ ఉన్న తేడా తెలిసిపోయింది. అదేమనగా ఐటీ కుర్రాళ్ళు "వీకెండ్ కి మాత్రమే ఇంటికి వస్తారు కాబట్టి వాళ్ళు వీకెండ్ హస్బెండ్స్. నేను గత మూడు నెలలగా మంగళ వారం నుండి గురువారం వరకూ మాత్రమే ఇంట్లో ఉంటున్న వీక్ డే మొగుణ్ణి. అయినప్పటికీ నన్ను వీక్ మొగుడు అన్నా సహించగలను కానీ ఇలా దొంగా, వెధవా లాటి బిరుదులు మా ఇంటా వంటా లేవు. ఆ మాటే నేను సవినయంగా మా ఆవిడకి విన్నవించుకున్నాను. నా వ్యక్తిత్వం మీద అలాంటి ఇంపార్టెంట్ విషయాలు కేకలు పెడుతూ చెప్తే, అవి ఆవిడకి వినపడవు సరి కదా, ప్రతిధ్వనించే అవకాశం కూడా ఉంది. అందువలనే ప్రగాఢమైన స్వవిషయాలు కేకలానంతర నిశ్శబ్ద వాతావరణంలో మన మాస్టర్ బెడ్ రూంలో మాత్రమే ప్రస్తావించమని నా ఉచిత సలహా.

అటు పిమ్మట ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని ఛేదిస్తూ "ఇంతకీ కిందటి వారం ఎక్కడకి వెళ్ళావూ? ఈ వారం ఇంట్లో ఉన్నావేం?" అని అడిగింది మా మహారాణీ. ఈ వాక్యాలలో "వెళ్ళావూ?" అంటే "అఘోరించావూ" అనియూ, "ఉన్నావేం" అంటే కూడా "అఘోరించావేం" అనియూ ప్రతిపదార్ధాలు.

"గత వారం అంతా గొప్ప వాళ్ళతో భుజాలు తడుముకునే కార్యక్రమంలో ఉన్నానోయ్, ఇదిగో చూడు కావాలంటే" అని భుజాలు ఎగరేశాను. అప్పుడు మా క్వీన్ విక్టోరియా చూసిన చూపు వర్ణనాతీతం కావున దాని గురించి ఎక్కువగా రాయలేను. ఎవరికి వారు ఊహించుకోవలసినదే!

అటువంటి నిరసన చూపుల అనంతరం "సర్లే, రేపు డాక్టర్ కి చూపించుకో ఆ భుజాలు. బాగా వాచి పోయినట్టున్నాయి. బాడీ ప్రపోర్షన్స్ అన్నీ మారిపోయి నీ మొహంలా ఉన్నావు" అని, "ఎన్నాళ్ళయిందో సుమా" అని తన అరచెయ్యి చూసుకుని ఫీలయిపోతూ తన ట్రేడ్ మార్క్ టెంకి జల్ల కొట్టేసి పారిపోయింది మా క్వీన్ విక్టోరియా.

ఇక్కడ గమనించవలసినది ఏమంటే మనం గొప్ప వాళ్ళతో భుజాలు పూసుకుని తిరిగితే మనకి ఒరిగేది ఏమిటీ, భుజాల వాపుడూ, నెత్తి మీద కొమ్ములూ తప్ప అనేదే మా ఆవిడ తాత్పర్యం.

నేను మటుకు గొప్పవాళ్ళతో తిరగడంలో కొన్ని ఉపయోగాలు ఉన్నాయి అని ఘంటాపథంగా చెప్పగలను.

ఉదాహరణకి, మొన్న చికాగో జరిగిన మహాసభలే తీసుకోండి. కొంతమంది గొప్పవాళ్ళకి నేను అనధికార బాడీ గార్డుగా అధికారుల చేత నియమించబడ్డాను. అనగా, కొంతమంది విశిష్ట అతిథులని ఎవరూ పట్టించుకో లేదూ అని టీకా తాత్పర్యం. ఇది వరకూ అలాటి సభలలో భోజనాల హాలులో ప్రత్యేక అతిథులకి.....ముఖ్యంగా ఇండియా నుంచి పిలిపించిన వారికి ప్రత్యేకంగా VIP Lounge అని ఒక చోటు కేటాయించే వారు. నేను కూడా ఎవరి గొప్పవారి చొక్కాయో, చెడ్డీయో పట్టుకుని అలాటి వీఐపీ భోజన శాలలోకి దూరిపోయేవాణ్ణి. ఈ సారి అలా కాకుండా ఎవరైనా సరే, ఏ రకం బాడ్జి పెట్టుకున్నా సరే, అందరూ ఒకే లైనులో నుంచోవలసి వచ్చింది. ప్రత్యేక ఆహ్వానితులు గొల్లపూడి మారుతీ రావు గారు, సుద్దాల అశోక్ తేజా, అవధానులు మేడసాని గారూ, రాళ్ళబండి కవితా ప్రసాద్ గారు, పరిపూర్ణానందగిరి స్వామి గారు, అందెశ్రీ, గోరాటి వెంకన్న గారూ అందరం, అందరిలాగానే లైనులో నుంచున్నాం. అరగంట తరవాత తీరా లోపలికి వెళ్ళే "పరివేశ దవారం" దగ్గరకి రాగానే ఒకానొక సెక్యూరిటీ తాటకి "Where are your food coupons? I will not let you in without them" అని తన కర్ణ కఠోరమైన గొంతుకతో అరిచి మమ్మల్ని ఆపేసింది. ఎంతో ధైర్యవంతుడినైన నేనూ, మిగిలిన గౌరవనీయులూ బిక్క చచ్చిపోయి కట్టుకున్న పంచెలలోనూ, వేసుకున్న గావంచాలలోనూ గబ, గబా వెతుక్కుని జేబుల్లోంచి, బేగుల్లోంచి, తడుముకుని ఆ పూటకి కావలసిన నీలం రంగు టిక్కెట్లని ఆవిడకి ఇచ్చి విధి నిర్వహణ గొప్పగా చేసిన ఫీలింగుతో ఆవిడ చేసిన వికటాట్టహాసాన్ని కనులారా వీక్షించి, గేటులోనించి లోపలకి వెళ్ళి, సాంబారూ, కూరలూ అన్నం మొదలైనవి పెట్టిన పొడుగాటి బల్ల దగ్గర మళ్ళీ లైనులో నుంచున్నాం. ఈ లోపుగా అదే పద్ధతిలో విశిష్ట అతిథి మరియు కీలకోపన్యాసం ఇవ్వడానికి వచ్చిన సిరివెన్నెల గారూ, ఆయన సతీమణీ కూడా మాతో బాటే లైనులో నుంచుని, నా భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వేసి, పలకరించి, నేను భుజాలు తడుముకునే కార్యక్రమాన్ని మరొక లెవెలు పెంచారు.

అప్పుడు అందరికీ నేను అన్నం పెట్టుకునే పళ్ళాలు ఇచ్చాను. ఆ పళ్ళాలలో కొన్ని గుండ్రం గానూ, మరికొన్ని చతురస్రాకారంలోనూ నాలుగైదు కన్నాలు ఉన్నాయి. అంటే పప్పుకి ఒక కన్నం, కూరకి మరొక కన్నం అలాగన్నమాట. నాకు తెలిసీ ఈ గొప్పవాళ్ళెవరికీ ఇలాగ క్యూలో నుంచుని తమ భోజనం తామే వడ్డించుకుని తినడం అలవాటు ఉండదు. ఇండియాలో డైనింగ్ టేబుల్ దగ్గర కూచోగానే సతీమణీ, లేదా వంటవాళ్ళూ దగ్గర ఉండి వడ్డిస్తూ మహారాజ భోగం అనుభవిస్తారు. అది జ్ఞాపకం వచ్చి, కవితా ప్రసాద్ గారు "అమెరికా మహారాజు గారూ, మీ ఇప్పుడొక పద్యం చెప్పవచ్చా అని అడిగి, నేను సమాధానం చెప్పేలోగానే "తాటకి ముందు లైనులోన, మరియు వెనుక లైనులోన నిలబెట్టి, నిలబెట్టి, చిప్ప చేతికిచ్చె చిట్టెన్ రాజన్" అని ప్రవచించారు. ఇందులో గమనించవలసినది ఏమిటంటే, గొప్పవాళ్ళతో భుజాలు రాసుకుని తిరిగితేనే వాళ్ళు మన మీద పద్యం చెప్పే అవకాశం ఉంటుంది కదా! లేని యడల పద్యం, గిద్యం జాంతానై కదా!

ఈ పద్య పఠనానికి అందరూ ఆనందిస్తూండగా శాకాహారులైన ఒక గొప్పాయన పొరపాటున కాలీఫ్లవర్ అనుకుని చికెన్ టిక్కా

ముక్కలు తమ ప్లేటులో అందుకోసం కేటాయించబడిన కన్నంలో వేసేసుకున్నారు. అది చూసి నేను వెంటనే అభిమన్యుడిలాగా దూకి, ఆ ప్లేటు లాక్కుని, శాకాహారానికీ, మాంసాహారానికీ ఉన్న తేడా వివరించి, జరగబోయే ఘోర విపత్తునుంచి ఆయననూ, మిగిలిన వారినీ రక్షించి పుణ్యం సంపాదించుకున్నాను. గొప్ప వారితో తిరగబట్టే కదా ఇటువంటి పుణ్యకార్యాలు చేసే సదవకాశం రావడం. నేనే కనక అక్కడ లేక పోతే ఆ చికెను స్వర్గానికీ, ఈ పండితులు గారు నరకానికీ పోయే వారే కదా!

అప్పుడు అక్కడ ఒకావిడ "ఫుడ్ కమిటీ" అనే పెద్ద బేడ్జీ పెట్టుకుని హడావుడిగా తిరుగుతూ ఈ గొప్పవాళ్ళందరినీ ఒక బల్ల దగ్గర చూడగానే వెంటనే తన హేండ్ బేగ్ లోంచి డిజిటల్ కెమేరా తీసి ఎడా, పెడా ఫోటోలు లాగే కార్యక్రమం మొదలుపెట్టింది. ఇక్కడ గమనించవలసినది ఏమిటంటే, గొప్పవాళ్ళతో ఉన్న ఫొటోలో ఆవిడ కూడా ఉండాలి కాబట్టి, వారి పక్కన ఆవిడ  పళ్ళికిలిస్తుండగా, ఆ "ఫుడ్ కమిటీ"  సుందరాంగికి ఫొటోలు తీసే బృహత్  కార్యం నా మీదే పడింది. ఆ అవకాశాన్ని తీసుకుని "అమ్మా, పాపం ఈ గొప్పవాళ్ళు అనేక కారణాలకి ఇబ్బంది పడుతున్నారు. మూడు లైన్లలో నుంచోడం, క్యూపాన్లు తెచ్చుకుని సినిమా టిక్కెట్లలా చూపించడం, ఏది శాకాహారమో, ఏది మాంసాహరమో తెలియయడం లేదు కాబట్టి అప్పడాల దగ్గరే ఆగిపోయి పరిశోధన చెయ్యడం మొదలైనవి బాగా లేదు. కనీసం రాత్రి డిన్నర్ టైము కైనా కొంచెం పరిస్థితి సరిదిద్ద గలరా" అని అడిగాను.

"సారీ, సార్, ఇక్కడ నా డ్యూటీ కేవలం మంచినీళ్ళు బల్ల మీద పెట్టడడమే!. మిగిలిన వన్నీ మా ఛైర్ పెర్సన్ గారే స్వయంగా చూస్తారు. కానీ మొత్తం ఈ కన్వెన్షన్ సెంటర్ యూనియన్‌కి కాంట్రాక్ట్ ఇచ్చేశాం. అంచేత ఆవిడ కూడా ఆవకాయ సప్లై డ్యూటీ తప్ప మరింకేమీ చెయ్యకూడదు". అనేసి కెమేరా లాక్కుని పారిపోయింది.

ఇప్పుడు చెప్పండి, గొప్ప వాళ్ళతో భుజాలు తడుముకోబట్టే కదా ఆ సుందరాంగికి ఫొటోలు తీసే సదవకాశం నాకు వచ్చిందీ! లేక పోతే ఆవిడ తాలూకు మొగుడు నన్ను అన్ని పోజులలో ఆవిడ ఫోటోలు తియ్యనిస్తాడా?

ఈ గొప్పవాళ్ళందరినీ నేను మళ్ళీ డాలస్‌లో వారి నెల నెలా తెలుగు వెన్నెల కార్యక్రమాల రెండవ వార్షికోత్సవ సభలో కలుసుకుని, ప్రారంభోత్సవ సమయంలో దీపం వెలిగించి, ఫొటోలు కూడా దిగాను. నాకు ఆ అవకాశం ఎందుకు వచ్చిందీ అంటే డాలస్ వారి సాహిత్య కార్యక్రమాలకి అందరూ హడిలిపోయే "సాహిత్య వేదిక" అనే పేరు బదులు "నెల నెలా తెలుగు వెన్నెల" అనే ఆహ్లాదకరమైన నామకరణం చేసిన అదృష్టవంతుణ్ణి నేనే కాబట్టి.

ఆ సమయంలో మైకులో నా పేరు విని, సుప్రసిద్ధ సినీ రచయిత చంద్రబోస్ గబ, గబా వచ్చి, "సార్, అమెరికా వచ్చినప్పటినించీ మీ గురించి అందరినీ అడుగుతున్నాను సార్. మీతో ఫొటో దిగాలని ఉంది" అని తన కెమేరా తీసి పక్కనే ఉన్న ఒకాయనకి  ఫొటో తీసే డ్యూటీ అప్పగించాడు. నేను విపరీతమైన ఆశ్చర్యంతో, గుడ్లప్పగించి చూస్తూ ఉంటే అతను "ఇండియాలో "రచన" మాస పత్రిక రాగానే మొట్టమొదట ఆఖరి పేజీలలో వచ్చే మీ అమెరికామెడి వ్యాసం చదివేసి, హాయిగా నవ్వుకుని, నా రోజువారీ కష్టాలు మర్చిపోతాను" అని నా కనుగుడ్లని మామూలు స్థాయికి తెచ్చి "మీరు గొప్పవారు సార్" అన్నాడు. వెంటనే నా భుజాలు తడుముకున్నాను. ఆశ్చర్యం ఏమిటంటే, అవి మామూలు సైజులోనే ఉన్నాయి, కానీ చంద్రబోస్ భుజాలు, పక్కనే ఉన్న సినీ గాయకుడు మనో భుజాలు, సైజు పెరిగినట్టు కనపడ్డాయి.

ఈ కథ అంతటితో ఆగలేదు. వీరందరూ మా తెలుగు సాంస్కృతిక సమితి ధర్మమా అని మా హ్యూస్టన్ వచ్చినప్పుడు, కవితా ప్రసాద్ గారు అవధానం చేస్తూ ఈ క్రింది కంద పద్యం చెప్పారు.

బెట్టిదముగ మాట్లాడవు

గుట్టులనవేం దాచుకోవు, కోరినవిచ్చే
పట్టుగల తీపి స్నేహపు
చెట్టువురా నేడు మాకు చిట్టెన్ రాజా!

ఆ మర్నాడే నా గాఢ మిత్రులూ-గూఢ శత్రువులూ అనేక మంది గుమిగూడిన రచ్చబండలో ఒకాయన నా పేరు రాయ లేదు కానీ చికాగో జరిగిన అవధానంలో నా అప్రస్తుత ప్రసంగం గురించి "was too much, too long, too self, centered, too insipid, and too much by two."అని అంగ్రేజీలో తన అమూల్యమైన చివాట్లు వేశాడు. ఆ చివాట్లు తిన్న ఆ రెండో అప్రస్తుత ప్రసంగి పేరు గొల్లపూడి మారుతీ రావు.

అసలు మనల్ని ఎవరైనా పొగిడితే గొప్పవాళ్ళం అవుతామా? తిడితే గొప్పవాళ్ళం అవుతామా? అదీ అసలు ప్రశ్న.

ఇప్పుడు నాకు నిజంగా ఏం చెయ్యాలో తోచడం లేదు. మా క్వీన్ విక్టోరియా చెప్పినట్టు రేపొద్దునే నా భుజాల సైజు గురించి డాక్టర్ దగ్గరకి వెళ్ళాలా వద్దా? ఒక వేళ వెళ్తే, పనిలో పని, నాకేమన్నా కొమ్ములు వచ్చాయేమో కూడా చెక్ చేయించుకుంటే సరిపోతుంది.

